# మర్యాదకు పోతే....

రచన :
.... ముక్కామల క్రిష్ణారావు ....

నా భార్య కాపరానికివచ్చి ముచ్చటగా మూడు నెలలైనా కాలేదు. పుట్టింటిలో వాళ్లని చూడాలని రోజూ రాత్రిళ్లు చిమ్మెట్లు పురుగుల్లా చెవిలో చీదరించేది. ఇంతలోనే ఆమెకు అటువంటిబుద్ధి పుడుతుందని నే నెన్నడూ అనుకోలేదు. ఆమెమీద నాకు కోపం ఒకవేళ వచ్చినా కొత్తపెళ్లాం అవడంవల్ల ఆమె కోరికను నిరాకరించలేకపోయాను. జీతాలింకా పదిహేనురోజు లుండడంవల్ల చేతిలో చిల్లిగవ్వేనా లేకపోయినా ఎంతో కష్టంమీద వడ్డీకి పది రూపాయిలు ముట్టెత్తి అత్తవారింటికి భార్యతో సహా బయలుదేరాను. రైల్వేనౌకర్ను కాబట్టి టికట్టు ఖర్చులేకపోతుంది. సిగరెట్లకని, టిఫిన్లకని, పుస్తకాలకని నాగురించి నాలుగు రూపాయిలు ఖర్చుపెట్టుకున్నాను. నా పెళ్ళాం గురించి ఖర్చుపెట్టింది రూపాయి మాత్రమే. విజయనగరం స్టేషన్‌లో దిగి జట్కా వాళ్ళతో బాధపడ్డాక భీమునిపట్నం వెళ్లే బస్సు స్టేండ్‌కి చేరుకున్నాం. ముందు నన్నుచూచి బస్సులో జాగా లేదని ఒక్క కసురు కసిరాడు కండక్టరు. తరువాత నా వెనకనున్న పెళ్ళాన్నిచూసి అనుకుంటాను 'రండీలోపలికి' అని కిటకిటలాడే బస్సులో చింతపండు బస్తాలా నన్ను కుదలేశాడు.

అత్తవారింటికి ఎట్లాగోచేరుకుని బస్సులో ప్రాప్తించిన నొప్పులను నాలుగురోజులదాకా అనుభవించి తిరుగుప్రయాణము కడుదునుకదా నా పెళ్ళాం మొగమాటం లేకుండా పుట్టింట్లో ఒక నెలరోజు లుండివస్తానని చెప్పివేసింది. నా గొంతులో తడి ఆరిపోయింది.

మర్నాడు ప్రయాణం అవుతుంటే 'ఏమన్నా రూపాయిలు కావాలా' అని నాభార్య చిరునవ్వుతో అడిగినప్రశ్నకు వద్దని జవాబు ఇచ్చేశాను. తీరా బస్సులోపడేక నా దగ్గర మిగిలినవి మూడు రూపాయిలే అని జ్ఞాపకానికి రాగానే గుండె ఝల్లుమంది.

తీరా ప్లాట్‌ఫారంమీద అడుగుపెట్టేసరికి తెలిసింది నేను ఎక్కవలసిన 'ట్రయిన్' పదినిమిషాలముందే వెళ్ళిపోయిందని. నాగుండెలో రాయిపడ్డట్లయింది. మళ్లీ రాత్రి పన్నెండు గంటలదాకా నాకు పనికివచ్చేబండి ఏదీలేదు. అప్పటికి దగ్గర మిగిలినవి రెండురూపాయిలే. ఈ ఆలోచనల్లో మునిగిఉండడంవల్ల రాయపూర్‌బండి ఎప్పుడొచ్చిందో తెలుసుకోలేకపోయాను. "ఏంరా ?" అంటూ నా భుజం మీద ఒక్క చరుపు పడగానే తుళుక్కుపడ్డాను. రాజు ఇంక అతనిభార్య అప్పుడే బొబ్బిల్నుంచి వస్తున్నారట. రాజు ఒక వరసలో—నా ఈడువాడైనా—నాకు పినతండ్రి అవుతాడు. విజయనగరంలో బంగారంగాజులు, గొలుసులు కొందామని వచ్చారట ఇద్దరూ.

ముగ్గురం కలసి ఊళ్ళోకి బయల్దేరాం. ముందు భోజనాలు ముగించుకొని తరువాత 'దుకాణాలకు వెళ్తే బాగుంటుందని అన్నాను నేను. అందుకు మారాజు వప్పుకున్నాడు. హొటల్లోకి వెళ్ళాక రాజు జేబులోంచి పర్సు తీస్తుంటే, నా మర్యాదను కాపాడుకుందుకు నా రెండు రూపాయిలపర్సును తీసాను బైటకు. అదిచూసి రాజు తన పర్సును జేబులో పడేసుకున్నాడు. అయ్యారు 3 'మీల్సు'కి డబ్బు విరుచుకొని నాచేతిలో బేడకాసు పెట్టాడు.

భోజనాలైన తరువాత రోడ్డుమీద అందుకున్నాడు రాజు. "ఐతే నువ్వు స్టేషన్‌కి వెళ్తావేంట్రా?" అన్న వాడి అమర్యాదకు నే నెంతో కష్టపడ్డాను. కాళ్ళీడ్చుకుంటూ స్టేషన్‌కి బయల్దేరాను. కానీ ఆ రెండణాలతో ఇంటికి ఎట్లా చేరుకోడమా అన్న సమస్య నన్ను కలవరపెడ్తూంది. రాత్రి భోజనం కావాలి. మర్నాడంతా బండిలో ఉండాలి. బుర్ర వేడెక్కిపోయింది. చటుక్కున మెదడులో ఒక ఆలోచన మెరుపులా మెరసింది. తిన్నగా బజారుకు వెళ్ళి మా అక్కయ్య నాపెళ్ళిలో పెట్టిన బంగారుటుంగరాన్ని అమ్మేసి 'మెయిల్' టికెట్టు కొనుక్కొని టింగురంగా అని మాఊరికి చేరుకుని జరిగిన సంగతులన్నీ మహా గొప్పగా మావాళ్లతో చెప్పాను. నాలుగుతిట్లు తిన్నాను.

